


"రేవతి"

గవర్నమెంట్ డాక్ బంగ్లాలో కూర్చుని తీరికగా ఆలోచిస్తున్నాడు ఫారెస్టు ఆఫీసర్ రంగారావు. రంగారావుకి "టైగర్ రంగారావ"నే పేరుంది. కారణం—ఒకటి—అతనెప్పుడూ డ్యూటీ విషయంలో చాలా కఠినంగా ఉంటూ ఉంటాడు. రెండు: పులివేట అంటే అమితమైన ఉత్సాహం చూపిస్తాడు. అతని ఐదేళ్ళ సర్వీసులోనే కనీసం డజన్‌పైగా పులుల్ని వేటాడేడు. అంత చక్కటి గురి అతనిది.

ఎంతో గడసరి మెకాల్ని సైతం ఒచేటొక్క గుండు దెబ్బతో నేల జారేట్లు కొట్టడం అతని అద్భుతమైన "షికారీ"కి నిదర్శనం. ఇంత వరకూ కూడా వేటలో రెండవ గుండు ఉపయోగించిన పాపాన్ని పోలేదు.

పెద్ద పెద్ద ఆఫీసర్లు సైతం పులి వేటలో అతనికున్న నైపుణ్యాన్ని చూడ్డం కోసం అతడితో రాత్రుళ్ళు అడవిలో మంచెమీద కూర్చుని పడిగాపులు పడతారు.

తన వయసిప్పుడు ఏభై దాటుతున్నా కూడా ఇప్పటికీ పులివేట అంటే అతనికి అమితమైన సరదా.

పనిలో అతి కఠోరంగా వుండే అతను కష్టపడి పనిచేసేవారంటే భలే ఇష్టపడతాడు. అందుకనే ఐ. ఎఫ్. ఎస్. పాసయి క్రొత్తగా జాయిన్ అయిన జానకిరావ్ తనకి చేరువ కాగలిగేడు. పనిలోనే ఛలాకీగా తిరుగుతూ పని చెయ్యడంలోనే విశ్రాంతి తీసుకోగల మన స్తత్వం గల జానకిరావ్‌ని అత్యంతమైన అను రాగంతో చూడగలిగేడు.

జీవితంలో పున్నమి వెన్నెల వెలుగునీ అమావాస్య కటిక చీకటి గల కాళరాత్రులనీ సమానంగా రుచి చూసిన రంగారావుకి జీవి తంలో కన్నుల వెలుగు లావణ్య.

లావణ్య ఎవరో కాదు. అనూరాధ తనకి జీవితంలో ఆనందాలని పంచియిచ్చిన రోజుల అందాల గురుతు లావణ్య. చిట్టితల్లి లావణ్యని తనకి వదిలేసి అనూరాధ అనంతవిశ్వంలో కలిసిపోయింది.

అప్పటినుండి లావణ్యని అరిచేతులమీదుగా పెంచి పెద్ద చేశాడు. అనేకమంది అగమ్యమైన జీవన మార్గాన్ని సరిచేసుకోడానికి మరో జీవన సహచరిని చూసుకోమని ఎన్నోవిధాల నచ్చ జెప్పడానికి చూశారు.

కాని, ఆ వచ్చే స్త్రీమూర్తి లావణ్యని ఏ దృష్టితో చూస్తుందో చిట్టితల్లికి తల్లిగా రావ డానికి ఒప్పుకుంటుందో లేదో అన్న భయం తోనూ జీవితంలో ఒకరికిచ్చిన మనస్సుని వాళ్ళే మళ్ళీ యింకొకరికి ఇవ్వడానికి మనస్సంగీక రించకా-ఒక స్త్రీ స్పర్శకి అలవాటు పడిన శరీరం మరో స్త్రీకి పంచి యివ్వలేకా పునర్వి వాహ ప్రస్తావనని సున్నితంగా తిరస్కరించేరు రంగారావుగారు.

లావణ్యని విశాఖపట్నంలోనే ఓ బోర్డింగ్ స్కూల్‌లో జాయిన్‌చేసి అడవే తన స్వర్గంగా, విధి నిర్వర్తించడం కోసమే జీవిస్తున్నట్లుగా జీవితాన్ని క్రమబద్ధంగా కొన్ని నియమాలకి కట్టుబడి నడిపిస్తూ "టైగర్ రంగారావ్" అనే పేరు సార్థకం చేసుకున్నారు.

లావణ్యని చూడాలనుకొన్నప్పుడు తన జీప్‌లో క్షణాలమీద వాలేరు చేరుకునేవాడు. ప్రతి సెలవులకీ లావణ్యని "ఇంద్రపురి" మన్యా లకి యింటికి తీసుకుని వచ్చేవారు. ప్రతిక్షణం లావణ్యలోనే అనూరాధను చూసుకుంటూ బ్రతుకే లావణ్యగా, లావణ్యే తన బ్రతుకుగా కాలం గడిపేరు.

ఆ అడవిలో శరద్రాత్రుల్లో ఎన్నో పున్నమి రాత్రులు వెన్నెల వెలుగుల్లో మంచె మీద కూర్చుని గతాన్ని నెమరువేసుకుంటూ వన్య మృగాలని చూడటం అతనికి ఆనందంగా వుండేది. ఒక్కోసారి వేటాడ్డం సరదా అని పించేది.


పులిని ఒకే ఒక్క గుండుతో నేల కొరి గేలా చెయ్యడం వేటలోని అతని నేర్పరి తనానికీ, నిశ్చలమైన గురికీ, లక్ష్యశుద్ధికీ నిద ర్శనం. రెండో గుండు వుపయోగిస్తే ఈ రంగారావు "టైగర్ రంగారావు" కానే కాడని సగర్వంగా చెప్పుకునేవారు.

నిజానికి జానకిరావ్ డ్యూటీలో చాలా సిన్సియర్‌గా ఉండేవాడు. డ్యూటీ విషయంలో జానకిరావ్ టైగర్ రంగారావుకి అనుచరుడనే అందరూ అనుకునేవారు.

ఈ నిర్జనారణ్యంలో జానకిరావ్ వచ్చిన తరువాత తనకి ఓ తోడు దొరికినట్లుగా ఫీల య్యారు. అంతకు ముందు ఎందరో అసి స్టెంట్స్ మారేరు. కాని జానకిరావ్‌లాగా ఇంత చేరువ కాగలిగిన వ్యక్తి ఏ ఒక్కరూ తారస పడలేదతనికి.

డ్యూటీ అంటే ఏదో కర్తవ్యంలా చేసుకు పోయేవారేగాని ప్రైడ్ ఆఫ్ వర్కింగ్‌తో పని చేసే జానకిరావ్ అంటే తనకి ఎంతో గౌరవం. అందుకే జానకిరావ్‌ని ఓ అసిస్టెంట్ అన్న భావంతో గాకుండా ఓ మంచి స్నేహితుడిలాగా ఆత్మీయునిలాగా చూడసాగేరు. ఇన్నేళ్ళ ఒంటరి జీవితంలోనూ సరైన తోడు దొరికి నట్లుగా ఫీలయ్యారు.

జానకిరావ్‌తో ఏర్పడిన ఈ బంధం అతని పెండ్లి అయిన తరువాత మరింత గట్టిపడింది.




మాలతి జానకిరావ్ జీవితంలో ప్రవేశించి అస్తమానం తనని బాబాయ్, బాబాయ్-అంకుల్ అని పిలుస్తూ జీవితంలో లావణ్య దూరంగా వున్న రోజుల్లో కూడా లావణ్యని మరపింప జేసింది.

ఒక్కో-రోజు లావణ్య దగ్గర లేనప్పుడు రాత్రుళ్ళు భయంకరమైన ఒంటరితనం తనని తినేస్తున్న సమయాల్లో తలగడాలో ముఖం దూర్చి సైలెంట్‌గా ఏడ్చుకునేవాడు అనూరాధ తనకు వేసిన శిక్షకు కుమిలిపోతూ.

ఒకరోజు ఇటువంటి సమయంలోనే మాలతి ఎలా కనిపెట్టిందో ఏమోగాని "ఏం బాబాయ్! నీలో నువ్వే అలా బాధపడుతున్నావ్?" అని తన దగ్గరున్న చనువువల్ల అడిగేసింది.

"అబ్బే! ఏం లేదమ్మా మాలా-నేను బాధ పడ్డం లేదు" అని పేలవంగా నవ్వేశాడు తను.

"కన్నీళ్ళతో తడిసిన తలగడా, ముఖాన బలవంతాన్ని తెచ్చిపెట్టుకొన్నట్టున్న ఆ నవ్వూ అబద్ధం చెప్పవు అంకుల్" అంది మాలతి.

మాలతి మాటలకి హాయిగా నవ్వేస్తూ "టైగర్ రంగారావు కంట ఎప్పుడూ నీరు రావడమమ్మా మాలా" అన్నాడు రంగారావు వాతావరణాన్ని తేలిక పరుద్దామన్న ఉద్దేశ్యంతో తెచ్చిపెట్టుకొన్న గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.

"అయితే పులులకి మనస్సులుండవా అంకుల్?" అంది మాలతి రెట్టిస్తూ కాస్త సీరియస్‌గానే.

"ఈ విషయం ఇంతవరకూ ఆలోచించనే లేదమ్మా మాలా" అన్నాడు రంగారావ్ హాస్యంగా కొంత ఆశ్చర్యాన్ని అభినయిస్తూ.

"హాస్యం కాదు అంకుల్. లావణ్యని చూడాలనుకుంటే వెళ్ళొచ్చునుగా. రాత్రుళ్ళిలా మీరు నిదురించకుండా ఇలా ఏడుస్తూ కూచుని ఆరోగ్యం పాడుచేసుకుంటే ఎలా చెప్పు?" అని సున్నితంగా మందలించింది.

మాలతి అలవాటే అంత. ఏది చెప్పాలనుకుంటుందో అది సూటిగా చెప్పేస్తుంది.

లావణ్య కూడా అంతే-అదే మంకుపట్టు.

"రాత్రిళ్ళు హార్లిక్స్ త్రాగమంటే ఎందుకు నెగ్లెక్టు చేస్తున్నారు డేడీ? మీరు హార్లిక్స్ త్రాగేవరకూ నేను భోజనం చేసేది లేదు" అని రాత్రికి రాత్రి జీప్ డ్రైవర్ని పట్నానికి పంపించి రెండు హార్లిక్స్ బాటిల్స్ తెప్పించింది.

నిజానికి లావణ్య పరోక్షంలో మాలతిలోనే లావణ్యని చూసుకు బ్రతుకుతున్నాడు.

అలా మరింత గట్టిపడింది జానకిరావ్‌తో తన బంధం మాలతిరాకతో. మాలతికి ఏ కష్టం వచ్చినా సహించేవారు కాదు రంగారావ్‌గారు.

మన్యాలకి క్రొత్తగా కాపురానికి వచ్చిన రోజుల్లో మాలతి డల్‌గా వుండేది. పట్న వాసం నుండి ఒక్కసారిగా అడవుల్లోకి రావటం వలన ఒంటరితనం ఫీలయ్యేది.

"పిక్చర్‌కి తీసుకెళ్ళమని చెప్పండి అంకుల్'' అని జానకిరావ్ ఎదుటనే అడిగేసేది నిర్భయంగా తనని.

"అవునోయ్, జానకీ! క్రొత్తగా పెళ్ళయిన జంట కనీసం వీకెండ్స్‌లోనయినా పిక్చర్స్‌కనీ, అలా అలా తిరగొచ్చుకదా! మాలతికి హోమ్ సిక్‌నెస్ రాకుండా చూడు" అని సున్నితంగా మందలిస్తే—

"ఊరుకోండి మామయ్యగారూ! మన్ దేస్‌లో మీ ఇన్‌స్పెక్షన్ ప్రోగ్రామ్స్ అటెండ్ అవ్వాలి గదా. డ్యూటీ ఫస్ట్" అనేవాడు జానకిరావ్.

మాలతి ఉడుక్కునేది.

"ఇలాగయితే నీకు ఛార్జిషీట్ ఇవ్వాల్సి వుంటుంది. ఇకమీదట మాలతి మనస్సు నొచ్చుకోడానికి వీల్లేదు, జాగ్రత్త!" అని వార్నింగ్ జారీ చేసేడు రంగారావ్ తన ఆఫీసర్ హోదాని జానకిరావ్‌కి జ్ఞప్తికి తెస్తూ.

లావణ్యతోకూడా మాలతికి మంచి స్నేహం కుదిరింది.

లావణ్యని చూడ్డానికి వెళ్ళినప్పుడల్లా మాలతి కూడా జీప్‌లో వెళ్ళేది. సెలవుల్లో లావణ్య వచ్చినప్పుడల్లా ప్రాక్టికల్‌గా ఇద్దరూ కలిసే తిరిగేవారు.

ఆ విధంగా ఆ రెండు కుటుంబాల మధ్యా విడదియ్యని బంధం ఏర్పడింది. వారిద్దరిమధ్యా సమ వయస్కులవడంమూలాన ఏ అరమరికలూ లేకుండా ఒకే కుటుంబంలోని వ్యక్తుల్లా కలిసిపోయారు.

అటువంటి జానకిరావ్ తనకే యింత ద్రోహం తలపెడతాడా?

రంగారావుగారి ఒళ్ళు ఆవేశంతో కుతకుతా వుడికిపోయింది.

ఆ రోజు తన కళ్ళని తనే నమ్మలేక పోయాడు.

మామూలుగా తనకుండే అలవాటు చొప్పున


శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సు స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 26, నార్తు బోగ్ రోడ్, మద్రాసు-17.




దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నులు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయుబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం – రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

బ్రాంచీలు:–తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.

(వి)చిత్ర విజ్ఞానం



మాల్‌దీవ్ ద్వీప వాసులకు గాలిపటాలంటే తగని పిచ్చి. చిన్నా పెద్ద తేడాలేకుండా గాలిపటాలు ఎగురవేసుకుంటూ సంతోషంగా కనిపిస్తారు. ఒక యాత్రికుడు అక్కడ ఒక పోస్టాఫీసుకు వెళ్ళాడు. అక్కడ స్టాంపులమ్ముతున్న గుమాస్తా తన ఎడమ చేత్తోనే డబ్బులు తీసుకోవడం, అదే చేత్తోనే స్టాంపులు చింపి యివ్వడం చూశాడు. పాపం అతనికి కుడిచేయి లేదేమో ననుకుని కౌంటరులోకి తొంగి చూశాడు యాత్రికుడు. ఆ గుమాస్తా తన కుడిచేత్తో పక్క కిటికీ గుండా ఓ గాలిపటం ఎగరవేస్తున్నాడు.

---

పున్నమినాటి రాత్రి వన్యమృగాల్ని చూడటం కోసమని సాయంత్రమే జీప్ తీసుకుని బయ లేరి మంచెమీద కూర్చున్నారు రంగారావుగారు. అప్పుడే వేసవి సెలవులకని లావణ్య వచ్చి వారం రోజులకు పైగా అయింది.

కొంతసేపు మంచెమీద కూర్చుని కూర్చుని ఆ రోజెందుకో విసుగనిపించి చీకటిపడుతూనే రిటర్న్ అయ్యేరు.

పండు వెన్నెల. మిలమిల మెరిసే నక్షత్రాలతో ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా వుంది.

"ఆనూ....! నా కెందుకీ ఒంటరితనాన్ని మిగిల్చి వెళ్ళిపోయేవు?" అనుకుంటూ ఉస్సురని నిట్టూరుస్తూ జీప్ గేరేజిలో పెట్టి వరండాలో అడుగు పెడుతూనే కాళ్ళకి బ్రేకులు పడ్డాయి.

లోన తన గదిలో డిమ్ రెడ్‌లేంప్ వెలుగులో రెండు నీడలు....గుసగుసలు....

రంగారావుగారు నవ్వుకున్నారు తన పండు మీసాల చాటున.

"బహుశా నేను లేననుకొని మాలతి-జానకిరావ్....ఓహ్!"

వాళ్ళని డిస్టర్బ్ చెయ్యడం ఇష్టం లేక వెనక్కి తిరిగేరు.

మెట్లు దిగుతూనే రంగారావుగారు నిశ్చేష్టులయ్యేరు.

వెన్నెల వెలుగులో ఎదురుగా వున్న జానకిరావ్ బంగ్లా ఆవరణలో అప్పుడే తెల్లని చీరలో అప్సరసలా వెలిగిపోతున్న మాలతి!

తన కళ్ళని తనే నమ్మలేకపోయారు. అంటే తన గదిలో జానకిరావ్-లావణ్య!

మళ్ళీ వరండాలో అడుగు పెట్టి నిశితంగా చూశారు.

"హే భగవాన్! ఏమిటీ పరీక్ష?"

లోన తన్మయత్వంలో జానకిరావ్-లావణ్య.

ఇప్పుడు ఏమయినా రచ్చ చేస్తే తన పరువే పోతుంది.

అనాలోచితంగా వరండాలో లైటు ఆన్ చేశారు ఏం చెయ్యడానికి తోచక.

వరండాలో లైటు వెలుగు విరజిమ్మే సరికి లోన వున్న జంటకి డిస్టర్బెన్స్ అయి, పెరటి గుమ్మంలోంచి జానకిరావ్ జారుకున్నాడు చల్లగా.

లావణ్య తొట్రుపాటుతో తలుపు తీస్తూ ఆశ్చర్యంగా "డేడీ!" అంది.

పులిపంజాలో చిక్కుకున్న మేకపిల్ల లావణ్య.

నిశ్చలంగా గంభీరమైన ముద్రతో మౌనంగా తన గదిలో చేరుకుని లైటార్పి పడుకున్నారు రంగారావుగారు.

జీవితంలో లావణ్యకి అన్నీ సమకూర్చేనే అని సంతృప్తిపడ్డ తనకి లావణ్యకి ఈ వయసులో ఇవ్వాల్సిందేది ఇవ్వలేకపోయేరో రంగారావుగారికి ఇప్పుడర్థమైంది.

ఎదిగిన కూతురికి ఎలా చెప్పడమా అని

మధనపడసాగేరు రాత్రల్లా.

జానకిరావ్ సంగతి తనకి బాగా తెలుసు.

అతనికున్న బలహీనతల్లా స్త్రీలోలత్వం.

ఎన్నోసార్లు తన చెవివరకూ వచ్చిన రిపోర్ట్లని త్రోసిరాజన్నారు రంగారావుగారు. రెడ్ హేండెడ్‌గా కంటబడిన సందర్భాల్లో కూడా తను ఎన్నోసార్లు జానకిరావ్‌ని సేవ్ చేసేరు.

"వయసు చాపలత్వాన్ని అదుపులో ఉంచుకోలేకుంటే కష్టాల్ని కోరి తెచ్చుకున్న వాడివౌతా"వని సున్నితంగా మందలించేరు.

నిజానికి తనేగాని తల్చుకుంటే మొట్టమొదటే జానకిరావ్‌ని మసిచేసేసి వుండేవారు. కాని, ఎందుకో జానకిరావ్‌పట్ల తన హృదయం సున్నితంగా పనిచేసింది. విధి నిర్వహణ విషయంలో చాలా సిన్సియర్‌గా వుండే అతనంటే ఎందుకో తనకే తెలియని ఆప్యాయత ఏర్పడింది.

మాలతి రాకతో జానకిరావ్ చక్కబడతాడని ఆశించేరు.

మారేడనే అనుకున్నారు.

ఇదేనన్న మాట మాలతి అప్పుడప్పుడూ దిగులుగా వుండటానికి కారణం.

అంటే మాలతి వచ్చినా కూడా తన అలవాట్లని మార్చుకోలేదు జానకిరావ్.

రుచులు మార్చగలిగిన పులి జానకిరావ్.

మేనీటర్....?

ఒక్కసారి మనిషి రక్తాన్ని చవిచూచిన పులి మాటి మాటికీ జనపదాల్నే వెతుకుతూ వుంటుంది.

ఇక ఉపేక్షించి లాభంలేదు. నిప్పు తన ఇంటివరకూ వచ్చింది.

మర్నాడు మార్నింగ్ బ్రేక్‌ఫాస్టు దగ్గర రంగారావుగారు "లావణ్యా!" అని మార్దవంగా పిలిచేరు.

"ఏం డేడీ?" అంది లావణ్య.

అమాయకంగా కనపడే లావణ్య ముఖంలో అనూరాధ నీడలు వెదుకుతూ "అమ్మా లావణ్యా! నిన్న రాత్రి నీతో జానకిరావ్....?"

"ఔను డేడీ! ఐ లైక్ హిమ్ వెరీ మచ్" అంది తడుముకోకుండా.

మిన్ను విరిగి మీద పడినట్లయింది రంగారావుగారికి.

లావణ్య చెంప ఛెళ్ళుమంది.

"నువ్వేం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా? ఏది మంచో ఏది చెడో తెలుసుకోలేని వయస్సు నీది. జానకిరావ్ పెళ్ళి చేసుకున్నవాడు. నీకు తగిన సంబంధం చూసి పెళ్ళి చేస్తాను. అంతవరకూ నీ హద్దుల్ని తెలుసుకుని ప్రవర్తించు. కూతురికి తల్లి చెప్పాల్సిన నీతులు, నేను నీకు చెప్పాల్సి వస్తుందని అనుకోలేదు. ఐయాం సారీ...." అంటూ బైటికి వెళ్ళిపోయారు విసురుగా.

ఉపాయంతో ఈ సమస్య పరిష్కరించాలి. అంతేగాని చెప్పి ప్రయోజనం లేదనుకున్నారు రంగారావుగారు. పైకి మాత్రం జానకిరావ్‌తో చనువుగానే వుంటున్నారు.

రంగారావుగారి మస్తిష్కం ఆలోచనల తీవ్రతకి వేడెక్కిపోయింది.

హృదయం తనపట్ల జానకిరావ్ చేసిన ద్రోహచింతనకి మండిపోతోంది.

"దొరా! చింతలతోపుల్లో మెకం తిరుగుతోంది దొరా! మాటి మాటికీ మా పల్లెమీద పడి మడుసుల్ని తింటోంది" అంటూ ఓ ఆటవికుడు చెప్పిన మాటల్తో ఈ లోకానికి వచ్చేరు రంగావ్‌గారు. తన ఆలోచనల గొలుసు తెగిపోయింది.

డాక్ బంగ్లా ఆవరణలో తను కూర్చున్న కుర్చీకి ఎదురుగా సవినయంగా చేతులు కట్టుకుని ఒంగి నిల్చున్నాడు ఆ అడవి మనిషి.


"ఏంటీ? మేనీటర్! ఎక్కడరా?" అని అడిగేరు.

పులి వేట అంటే సరదా వేసింది!

"చింతలతోపుల్లో దొరా! గరిభీరగెడ్డ ఒడ్డున నిన్న టేల యిద్దర్ని యేసేసింది దొరా!"

"సరే పద. చూపెట్టు దారి" అంటూ జీప్ తీసేరు రంగారావుగారు.

ఓ గంటలో ప్రదేశం పరిశీలించి పులి అడుగుజాడల్ని చూసి, అనువైన చోట ఎదురెదురుగా వున్న రెండు చెట్లమీద రెండు




మంచెలు కట్టించేరు. భారమంతా ఒకే త్రాటి మీద వచ్చేలాగా ప్రత్యేకంగా కట్టించేరు.

ఈ రోజు వేటలో పులి పడిపోయి తీరాలి.

జానకిరావుని కూడా ఆహ్వానించేరు పులి వేటకి.

జానకిరావ్ పులివేట గురి రంగారావుగారి దగ్గర నేర్చుకున్నాడు. రెండు మూడు సందర్భాల్లో రంగారావుగారు "మొదట నువ్వెయ్యి- తప్పించుకుంటే నేను చూసుకుంటాను" అని చెప్పి జానకిరావ్ లక్ష్యశుద్ధిని ఇంప్రూవ్ చేశారు.

సాయంత్రం మునిమాపువేళకి జీపులో ఫ్లాష్‌లైట్లు, గన్స్, తూటాలు, టార్చిలైట్లు. ఫ్లాస్కు నిండా టీ, బిస్కెట్లు పట్టుకుని నిర్దేశించిన స్థలానికి చేరుకున్నారు.

రాత్రి సుమారు ఎనిమిది అవుతోంది.

ఫుడ్ స్నేక్స్ కానిచ్చేసి జానకిరావ్‌ని ఎలర్ట్ చేసి ఎదురుగా వున్న మంచెమీదికి ఎక్కించి తను ఇవతలి మంచెమీద మాటువేసి కూర్చున్నారు.

రెండు మంచెలకి మధ్యన అనువైన చోట ఓ చెట్టుకి ఒక మేకపోతు బలి కట్టబడింది.

నిశ్శబ్ద నిశీధిలో ఉండుండి వన్యమృగాల అరుపులు గుండెలదిరేలాగా వినిపిస్తున్నాయి. మిణుగురు పురుగులు మిలమిలా మెరుస్తూ రాత్రికి మరింత శోభని చేకూరుస్తున్నాయి.

బలికి కట్టబడిన మేకపోతు గిలగిలా కొట్టుకొంటూ హృదయవిదారకంగా అరుస్తోంది.

రేడియం డయల్ వాచ్‌లో టైం చూసేరు రంగారావుగారు.

ఒంటిగంట దాటుతోంది.

నిద్రజోగు రాకుండా టీ త్రాగేరు.

ఉండుండి శ్వాస ఆగిపోయిందా అన్నట్లుగా గబ్బుకంపు.

పొద చాటున చిన్న అలికిడి.

రెండు కళ్ళు మిరుమిట్లు గొలిపేలా పొద చాటునుండి పొంచి చూస్తున్నాయి.

అంటే చారల మెకం వచ్చిందన్న మాట. వేటమీదికి వురికే ముందు "ఫ్రీజ్" అయిపోయి పరిసరాలు తనకి అనుగుణ్యంగా ఉన్నాయో లేదో అని పరిశీలిస్తోంది అనుకుంటూ ఊపిరి తీసుకుని రైఫిల్ అందుకు

న్నారు రంగారావ్‌గారు.

బలికి కట్టబడిన మేకపోతు కూడా ఆపద పసిగట్టిందో ఏమోగాని దాని అరుపులు మరింత ఎక్కువయ్యాయి.

ఉన్నట్లుండి ఒక నిశ్చయానికి వచ్చిన వాడిలా 'ట్రిగ్గర్' మీద వ్రేలుంచేరు.

ఈ దెబ్బతో పులి పడిపోవాలి-అనుకుంటూ నిశీధిలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని "ట్రిగ్గర్" నొక్కేరు.

గురి తప్పలేదు.

అనుకున్న ప్రకారమే ఎదురుగా వున్న మంచెకి కట్టబడిన బలమైన త్రాటి ముడికి తగిలి మంచె తిరగబడింది.

అంతే తృటి కాలంలో పులి క్రిందపడింది.

మనిషి రక్తానికి అలవాటు పడిన మేనీటర్ బలికి కట్టబడిన మేకను వదిలి క్రిందపడిపోతూ ఆర్తనాదం చేసిన జానకిరావ్‌ని నోట కరచుకుంది.

ఒకే ఒక్క పంజా దెబ్బతో రంగారావ్ గారిని పట్టుకున్న సమస్య వదిలిపోయింది.

ఈ సారి రెండవ గుండు ఉపయోగించక తప్పిందికాదు రంగారావ్‌గారికి.

వెన్నెల వెలుగుతో చారల మెకం నోట గిలగిలలాడుతున్న జానకిరావ్ క్లియర్‌గా కనిపించేరు. నోట కరచుకుని ఒక్క వురుకు వురికింది చారల మెకం. ఉరికిన పులి నేలని ముట్టకుండానే రంగారావుగారి రైఫిల్ రెండవ గుండు విడిచింది.

అంతే....పులి నేలకొరిగింది భీభత్సంగా అరుస్తూ.

మేక "సేవ్" అయింది.

రకగారావుగారు మంచె దిగేరు.

కొన వూపిరితో వున్న జానకిరావ్ "మామయ్యగారూ...." అని పడిపోయేడు.

ద్రోహచింతనతో తనకే ద్రోహం తలపెట్టినందుకు శిక్ష విధించినా ఓ ప్రక్క మాలతి గుర్తుకి వచ్చి అంతరంగంలో లావణ్య మెదులుండగా ఓ కంట నీరూ ఓ కంట రక్తం చిందిస్తూ "క్షమించమ్మా మాలా...." అనుకుని జీప్ బంగ్లావైపు పోనిచ్చేరు.

క్షణాలమీద మాలతిని, లావణ్యని వెంటబెట్టుకొని ఆ స్థలానికి వచ్చేరు రంగారావ్‌గారు.

ఆ రాత్రి వెన్నెల వెలుగులో మాలతి తన భర్త శవంమీద పడి హృదయవిదారకంగా ఏడుస్తుంటే...."మేక గురించని పులిని వేటాడక తప్పదు-క్షమించమ్మా మాలా...." అని మనస్సులోనే విలపిస్తుండగా శిల నుండి రెండు అశ్రువులు రాలేయి, ఎప్పుడూ కంట తడి పెట్టననుకునే టైగర్ రంగారావుకి.

అంతరంగంలో "పులులకి మనస్సులుండవా అంకుల్!" అంటూ హృదయవిదారకంగా ఛాలెంజ్ చేస్తోంది మాలతి. □


మీరు చదివారా!

ప్రమోద
పిల్లల మాస పత్రిక

వెల : రూ. 1-25
సం. చందా
రూ. 15/-